క్లుప్తంగా

పనుల ప్రదేశాల వద్ద తాగునీరు



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధి మడ్డువలసలో ఉపాధి హామీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. మస్తర్లు పరిశీలించారు. ఎటువంటి అవకతవకలకు పాల్పడొద్దని సూచించారు. వేతనదారులకు కనీసం రూ.272 అందేలా రెండు పూటలు పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సామంతుల సంగంనాయుడు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



మడ్డువలసలో సిటిజన్ ఔట్ రీచ్ సర్వే నిర్వహిస్తున్న ఎంపీడీఓ

వంగర: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి మడ్డువలసలో సిటిజన్ ఔట్ రీచ్ సర్వే శుక్రవారం నిర్వహించారు. పథకాలు అందుతున్న తీరును లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులకు గ్రామ సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, పథకాలు బాగున్నాయని పలువురు లబ్ధిదారులు వెల్లడించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



రంగప్పవలసలో బోరు బాగు చేయిస్తున్న సర్పంచ్ శనపతి రాంబాబు

తెర్లాం: మండలంలోని రంగప్పవలసలో తాగునీటి ఎద్దడి నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ శనపతి రాంబాబు అన్నారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ రాంబాబు ఆదేశాల మేరకు గ్రామంలో పాడైన బోరుబావులకు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, బోరుబావులను ప్రజలు సక్రమంగా వినియోగించుకుంటే, వేసవిలో తాగునీటి ఇబ్బందులు రావన్నారు.

రంగప్పవలస పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

తెర్లాం: మండలంలోని రంగప్పవలస ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ త్రినాథరావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, జగనన్న గోరుముద్ద మెనూ అమలు, మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల పరిసరాలను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, జగనన్న గోరుముద్ద పథకంలో నిర్వాహకులు మెనూ ప్రకారం వంటలు చేస్తున్నారా, లేదా అని ఉపాధ్యాయులు పరిశీలించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు ప్రభుత్వం ఇచ్చే విద్యాకానుక, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద పథకాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు.

మస్తర్ల పరిశీలన



వేతనదారుల మస్తర్లు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు ప్రతిరోజూ తనిఖీ చేయాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. మండలంలోని గంగన్నపాడులో గేదెలవాని చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారుల మస్తర్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎటువంటి అవకతవకలు జరగకుండా పనులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి వినోద్, ఉపాధి సాంకేతిక, క్షేత్ర సహాయకులు ఉన్నారు.

ఎమ్మార్సీలో గ్లాసుల పంపిణీ

రేగిడి: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్దల కార్యక్రమానికి సంబంధించి రాగిజావ తాగే గ్లాసులను ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు పలు పాఠశాలల హెచ్ఎంలకు శుక్రవారం అందించారు. హెచ్ఎంలు వీటిని విద్యార్థులకు అందించాలని సూచించారు. వీటి ద్వారానే విద్యార్థులకు రాగిజావను అందించాలని సూచించారు.

నమ్మకం పెరుగుతోంది...

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉన్నారు. అన్నివర్గాల వారికి మేలు చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తుండడం.. ఎక్కడా ఎటువంటి అవినీతి లేకపోవడంతో జగనన్నతోనే మా భవిష్యత్ అని ప్రజలు నినదిస్తున్నారు. టీడీపీ నాయకులు ఎన్ని ఆరోపణలు చేస్తున్నా.. వైఎస్సార్ నాయకులు, కార్యకర్తలను ప్రజలు ఆదరిస్తున్నారు. 'గడప గడపకు..', జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు విజయవంతం కావడమే ఇందుకు నిదర్శనం. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు 'జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం శుక్రవారం వాడవాడలా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం తెలుసుకోవడంతో పాటు ఇళ్ల యజమానుల అనుమతితో గోడలపై జగనన్న స్టిక్కర్లు అతికించారు.



సంతకవిటి: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో స్టిక్కర్లతో గ్రామస్తులు, సర్పంచ్ దోల తిరుపతి తదితరులు



బొబ్బిలి: గొల్లపల్లి 12వ వార్డులో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం



రాజాం : గురవాంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు నర్సింహులు, శ్రీరంగంనాయుడు తదితరులు



వంగర: శివ్వాంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న సర్పంచ్ వెంకటప్పల నాయుడు, వెంకటనాయుడ, పార్టీ శ్రేణులు



రాజాం సిటీ: ఆగూరులో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న గృహసారథులు



రామభద్రపురం: ఇంటింటికీ వెళ్ల అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు,గృహసారథులు



రేగిడి:గుళ్లపాడులో ప్రచారం చేస్తున్న సర్పంచ్ చక్రపాణి, ఎంపీటీసీ గౌరునాయుడు, తదితరులు

మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే..

- డిప్యూటీ సీఎం రాజన్నదొర



లబ్ధిదారుడికి బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటి సీఎం రాజన్నదొర

మెంటాడ: రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖా మంత్రి పీడిక రాజన్నదొర జోష్యం అన్నారు. మండలంలోని జక్కువలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి రాజన్నదొరకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి, తదితరులు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ పాలనపై ప్రజాభిప్రాయం తెలుసుకున్నారు. అలాగే ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారన్నారు. గ్రామాలు, పట్టణాల్లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలను వైఎస్సార్‌సీపీ నాయకులను ఆదరిస్తున్నారని తెలిపారు. గడప గడపకు... జగనన్నే మా భవిష్యత్.. వంటి కార్యక్రమాలు విజయవంతం కావడం ఇందుకు నిదర్శనమన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ లచ్చిరెడ్డి సత్యవతి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సంధ్య, ఎంపీపీ ఆర్ఎస్ నాయుడు, వైస్ ఎంపీపీ ఎస్ఈ రావు, మండల నాయకుడు ఎల్ఆర్ నాయుడు, పీఏసీఎస్ చైర్మన్ ఆర్.అప్పారావు, రాజప్పలనాయుడు, పి.అచ్చుత్, లచ్చిరెడ్డి అప్పలనాయుడు, కర్రి అప్పలస్వామి, మయూరి అప్పలనాయుడు, హనుమంత రాజు, భాయి అప్పారావు, పున్నాన చిన్నంనాయుడు, మోహన్, కిలపర్తి మధు, ఎంపీడీఓ త్రివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

- డిప్యూటీ డీఈఓ డాక్టర్ తిరుపతినాయుడు



పరీక్షల నిర్వహణపై సూచనలు చేస్తున్న డిప్యూటీ డీఈఓ తిరుపతినాయుడు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న ఫేజ్–2 'మనబడి నాడు – నేడు' పథకం పనులు సకాలంలో పూర్తి చేసేందుకు ప్రధానోపాధ్యాయులంతా చర్యలు చేపట్టాలని బొబ్బిలి డిప్యూటీ డీఈఓ డాక్టర్ ఎన్.తిరుపతినాయుడు అన్నారు. తెర్లాం హైస్కూల్‌లో జరుగుతున్న నాడు–నేడు పనులు, ఎస్ఏ–2 పరీక్షల నిర్వహణను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు ప్రొగ్రెస్ కార్డులు అందజేయాలన్నారు. వేసవి సెలవుల్లో అందరం పుస్తకాలు చదివేద్దాం కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఆయనతో పాటు ఎంఈఓ త్రినాథరావు, హెచ్ఎం పాపారావు, తదితరులున్నారు.

రక్తదాతలు స్ఫూర్తిదాతలు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

రాజాం సిటీ: రక్తదాతలు మరొకరికి స్ఫూర్తిగా నిలవాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక వికాసతరంగిణి కార్యాలయంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఒకరు దానం చేసిన రక్తం మరికొంతమంది ప్రాణాలను కాపాడుతుందని తెలిపారు. గ్రామీణ ప్రాంత యువతతో పాటు పట్టణ ప్రాంతాల్లోని యువకులు సైతం ఈ కార్యక్రమానికి ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. శిబిరంలో 40 మంది రక్తదానం చేశారని రెడ్‌క్రాస్ సభ్యులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్‌లు తెలిపారు. వికాసతరంగిణి అధ్యక్షులు టీటీవీ రమణమూర్తి, బీవీ అచ్యుత్‌కుమార్, పెంకి గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వికాసతరంగిణి కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన తరువాత బొబ్బిలి జంక్షన్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించారు.

మంచి సమాజ నిర్మాణానికి నాంది పలకాలి

రాజాం సిటీ: ప్రతి ఒక్కరు మంచి సమాజ నిర్మాణానికి నాంది పలకాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. రాజాంలోని లోలుగు సుశీలమ్మ మెమోరియల్ ఫౌండేషన్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి తల్లి పిల్లలను క్రమశిక్షణతో పెంచాలని అన్నారు. పిల్లలకు సమాజం పట్ల సేవాభావం కలిగేలా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని, తద్వారా మంచి సమాజాన్ని నిర్మించేందుకు తోడ్పడుతుందని అన్నారు. సేవ చేయాలనే సంకల్పం ఉంటే చాలని, సమాజంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేయవచ్చునని అన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు లోలుగు మదన్‌మోహన్ మాట్లాడుతూ సమాజసేవ ధ్యేయంగా పనిచేస్తామని అన్నారు. జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీ ఆర్ఎస్‌వీ ప్రసాద్, జె.గిరీష్, వావిలపల్లి జగన్నాథంనాయుడు, పలువురు ప్రముఖులతో పాటు పట్టణవాసులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయండి



పనులు పరిశీలిస్తున్న అధికారులు

రాజాం: కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయాలని ఎంపీడీఓ బాసూరీ శంకరరావు వేతనదారులకు సూచించారు. మండలంలో అంతకాపల్లి గ్రామంలో బోనెలవాని చెరువులో ఉపాధి పనులు ఆయన శుక్రవారం పరిశీలించారు. వేతదారులకు అవగాహన కల్పించారు. పనులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. రెండు పూటలా చేయడం ద్వారా కనీస వేతనం రోజుకు రూ.250లు దాటి వస్తుందని అన్నారు. వేసవి ఎండ ఎక్కువగా ఉంటే ఉదయం 9 గంటలకల్లా పని ముగించాలని, మధ్యాహ్నం 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటలు వరకూ పని చేయాలని సూచించారు. ఏపీఓ సాయిరాం, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

1 నుంచి వేసవి శిక్షణ శిబిరం

రాజాం: రాష్ట్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో మెంతిపేట బాలభవన్ వద్ద మే 1 నుంచి వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నామని బాలభవన్ డైరెక్టర్ రమేష్ మాస్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నెల రోజులు పాటు ఈ శిక్షణ శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి అంశాల్లో శిక్షణ ఇస్తామని వెల్లడించారు. ప్రతీ రోజు ఉదయం 7 గంటల నుంచి 11.30 గంటల వరకూ ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ఆసక్తి ఉన్న విద్యార్థులు మెంతిపేట బాలభవన్ వద్ద వివరాలు నమోదు చేసుకోవాలని అన్నారు. మిగిలిన వివరాలకు 83416 43824, 94401 02500, 99858 99123 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్లాసుల పంపిణీ

రాజాం: మండల రిసోర్సు కార్యాలయం వద్ద శుక్రవారం ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు రాగిజావ గ్లాసులు పంపిణీ చేశారు. ప్రభుత్వ విద్యాశాఖ వీటిని అందించిందని ఎంఈఓ పి.నాగయ్య తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రాగిజావ వంటకం విద్యార్థులకు ఈ గ్లాసులు ద్వారా అందించాల్సి ఉందని వెల్లడించారు.

ఉపాధి పనుల పరిశీలన

సంతకవిటి: మండలం మిర్తివలస గ్రామంలో సోమన్నదొర చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సర్పంచ్ రాజాపు భూపతిరావు, ఎంపీటీసీ రాజాపు రమణారావు శుక్రవారం పరిశీలించారు. సరైన వేతనం వేతనదారులకు అందేలా చూడాలని టెక్నికల్ అసిస్టెంట్ పివి.రమణారావుకు సూచించారు. క్షేత్ర సహాయకురాలు రమణమ్మ, వేతనదారులు పాల్గొన్నారు.

రా.ర.వే సమావేశం రేపు

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో రాజాం రచయితల వేదిక సమావేశం ఆదివారం నిర్వహించనున్నామని వేదిక నిర్వాహకులు గార రంగనాథం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ సాహితీవేత్త నల్ల రవికుమార్ అధ్యక్షతన జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత పిల్లా తిరుపతిరావు '1818 దీర్ఘకవిత–పరిశీలన' అనే అంశంపై ప్రసంగించనున్నారని అన్నారు. కార్యక్రమానికి సాహితీవేత్తలు, రచయితలు, సాహిత్యాభిమానులు హాజరుకావాలని కోరారు.

అందరూ సమన్వయంతో పని చేయాలి

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన

బొబ్బిలి: మండల అభివృద్ధికి అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేయడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాల నాయుడు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లాన ఒక్కో శాఖపై సమీక్ష నిర్వహించారు. తాగునీటి సమీక్షలో ఏయే గ్రామాలకు ఇంటింటి కుళాయిల తాగునీరు అందుతోంది? ఏయే గ్రామాలకు సక్రమంగా అందడం లేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను ప్రశ్నించగా.. పనులు జరిగిన అన్ని గ్రామాల్లోనూ తాగునీరు అందుతోందని సమాధానమిచ్చారు. రూ.3 కోట్లతో మొదటి దశ, రూ.14 కోట్లతో రెండో దశ పనులు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని అధికారులు ఎంపీ ప్రశ్నకు సమాధానంగా బదులిచ్చారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని పిరిడి వైద్యుడు రమేష్‌కు సూచించారు. అలాగే మొదటి దశలో 32 పాఠశాలలు, రెండో దశలో 14 పాఠశాలలను నాడు – నేడు నిధులతో అభివృద్ధి చేస్తున్నట్లు ఎంఈఓ చల్ల లక్ష్మణరావు తెలిపారు. వ్యవసాయాన్ని ఉపాధి హామీ పథకానికి అనుసంధానం చేయాలని సర్పంచ్ గంట సింహాచలం కోరారు. ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధితో పాటు సంక్షేమం

- ముఖ్యమంత్రి జగనన్న పాలనలో సుఖసంతోషాలతో ప్రజలు
- ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



సంక్షేమ పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: ఓ పక్క అభివృద్ధి.. మరోపక్క సంక్షేమంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మెరుగైన పాలన అందిస్తున్నారని, ఆయన పాలనలో అన్నివర్గాల ప్రజలు సుఖ,సంతోషాలతో ఉన్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని అలజంగిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. నాలుగేళ్ల కాలంలో సంక్షేమ పథకాలతో ఒక్కో ఇంటికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలపై ప్రజలు ఆనందం వ్యక్తం చేయడంతో ఎమ్మెల్యే, తదితరులు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, సర్పంచ్ రేజేటి భద్రమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పూడి చిన్న, రేజేటి బుజ్జి, ఉప సర్పంచ్ పొట్నూరు లక్ష్మునాయుడు, మండల, సచివాలయ అధికారులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకలు



గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న ఎంపీపీ ఉమాలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీఓ రాజ్యలక్ష్మి, తదితరులు

తెర్లాం: మండల కేంద్రంలోని కల్యాణ మంటపంలో ఐసీడీఎస్ బాడంగి ప్రాజెక్ట్ సీడీపీఓ కె. రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ప్రీ స్కూల్ గ్రాడ్యుయేషన్ వేడుకలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య నేర్పించడం అభినందనీయమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తోందని చెప్పారు. ఎంపీడీఓ రామకృష్ణ మాట్లాడుతూ.. పాఠశాలలు, కళాశాలల మాదిరిగానే అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీ స్కూల్ పిల్లలకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంఈఓ త్రినాథరావు మాట్లాడుతూ, చిన్నారులకు యోగ్యతా పత్రాలు అందజేయడం చాలా మంచిదని, అయితే ప్రీస్కూల్ పిల్లలంతా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, ప్రతిఏటా గ్రాడ్యుయేషన్ వేడుకలు నిర్వహిస్తామన్నారు. అనంతరం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తెర్లాం, పెరుమాళి, లోచర్ల అంగన్‌వాడీ సెక్టార్ల సూపర్‌వైజర్లు ఉషారాణి, చిట్టెమ్మ, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బిందు సేద్యంతో అధిక లాభాలు

- ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ



బిందు సేద్యం యంత్రాన్ని పరిశీలిస్తున్న పీడీ లక్ష్మీనారాయణ

బాడంగి: బిందు, తుంపర సేద్యంతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ పీఎస్‌వీ లక్ష్మీనారాయణ అన్నారు. మండల కేంద్రానికి చెందిన మరిపి అనసూయకు చెందిన మామిడితోటలో ఇటీవల ఏర్పాటు చేసిన బిందు సేద్యం యంత్ర పరికరాలు పనితీరు, పైపుల అమరికను పీడీ స్వయంగా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షధార పంట భూములలో మామిడి జీడి, కొబ్బరి, ఆయిల్‌పామ్, సపోటా, జామ, చెరుకు, కూరగాలయలు సాగు చేసే రైతులు బిందుసేద్యంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ విధానంతో సాగునీరు ఆదా చేయడంతో పాటు కూలీల ఖర్చు మిగులుతుందని, అలాగే అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. యంత్ర పరికరాలు కూడా రాయితీపై రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, ఎంఐఏఓ శంకరరావు, వీఏఏ జయలక్ష్మి, వేణుగోపాలరావు పాల్గొన్నారు

సంక్షిప్తంగా...

వేసవిలో ఆరోగ్య సూత్రాలు పాటించాలి

రేగిడి: మండలంలో మునకలవలస గ్రామంలో రాజాం కేర్ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత చర్మవ్యాధుల వైద్య శిబిరాన్ని జీఎంఆర్ ఐటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ నిర్వహించింది. శిబిరంలో పలువురుకు వైద్యతనిఖీలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా వైద్యులు వినోద్ మాట్లాడుతూ వేసవిలో ఆరోగ్య సూత్రాలు పాటించాలని, ప్రధానంగా చర్మవ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అన్నారు. సర్పంచ్ వి.చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కేవీఎస్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామానికి చెందిన యువకులు పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువలో హద్దులు

రేగిడి: మండలంలో ఆరు గ్రామాల్లో జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో భాగంగా లక్ష్యానికి చేరువలో హద్దులు ఏర్పాటు జరుగుతుందని తహసీల్దార్ కల్యాణచక్రవర్తి తెలిపారు. మండలంలో జోడిబందల గ్రామంలో హద్దుల ఏర్పాటును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోడిబందల, ఉప్పర్నాయుడువలస, ఆడవరం, అక్కన్నఅగ్రహారం, కందిశ తదితర గ్రామాల్లో 12,934 ఎకరాల్లో హద్దులు ఏర్పాటుచేయాల్సి ఉందని, ఇంతవరకూ 4900 ఎకరాల్లో వీటిని పూర్తి చేశామని అన్నారు.

చురుగ్గా సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే

తెర్లాం: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం నుంచి సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే ప్రారంభమైంది. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లంతా కలిసి ప్రతి ఇంటికీ వెళ్లి సిటిజన్ ఔట్‌రీచ్ సర్వేలో భాగంగా ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. తెర్లాంలో జరుగుతున్న సర్వేను పరిశీలించిన ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ మాట్లాడుతూ, రెండు రోజుల్లో సర్వే పూర్తి చేయాలన్నారు.

ఆయుర్వేద వైద్యంతో రోగాల నయం

రేగిడి: ప్రభుత్వ ఆయుర్వేద మందులను దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వినియోగిస్తే ఎంతో ఉపయోగం ఉంటుందని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ సూచించారు. మండలంలో కొమెర గ్రామంలో ఆయుర్వేద వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 మందికి తనిఖీలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. శిబిరంలో సర్పంచ్ పాడి లక్ష్మున్నాయుడు, హెచ్ఎం శ్రీనివాసరావు, యోగా ఇన్‌స్ట్రక్టర్ రామకృష్ణ, శైలజ, ఏఎన్ఎం విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

బాడంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో జవహర్ నవోదయ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష శనివారం నిర్వహించనున్నట్లు పరీక్షకేంద్రం చీఫ్ ఎస్. త్రినాథరావు తెలిపారు. ఈ మేరకు ఇన్విజిలేటర్లతో శుక్రవారం ఆయన సమావేశమై పరీక్ష నిర్వహణపై సమీక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి 1.30 వరకు జరుగుతుందని, విద్యార్థులు అరగంట ముందు చేరుకోవాలని సూచించారు.

ప్రహరీ నిర్మాణ పనుల పరిశీలన

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో రూ.9 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ ప్రహరీ నిర్మాణాన్ని క్వాలిటీ కంట్రోల్ ఏఈ వి.రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఈ పంచాయతీకి రూ. 20 లక్షలు మంజూరీ కాగా, ఈ నిధుల్లో కొంత నిధులతో ఈ ప్రహరీ నిర్మాణం జరిగినట్లు పీఆర్‌జే ప్రభాకర్ వెల్లడించారు. నాణ్యత ప్రమాణాల వివరాలు నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండి నర్సింహులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ కామేష్ తదితరులు ఉన్నారు.

అన్న సమారాధన

రాజాం : మండలంలోని వీఆర్‌అగ్రహారం సమీపంలో రెండవ మైలురాయి రోడ్డు వద్ద కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. గత మూడు రోజులుగా విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం భారీ అన్నసంతర్పణ నిర్వహించగా, వీఆర్‌అగ్రహారం, అంతకాపల్లి, మొగిలివలస, పొగిరి తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

రాజాం సిటీ: స్థానిక వాసవీ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వాసవీక్లబ్ మనరాజాం–సారథి, వనిత కాంతి కిట్టి సభ్యులు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో రాగోలు జెమ్స్ ఆస్పత్రి వైద్యులు పలువురికి తనిఖీలు చేశారు. శిబిరానికి 243 మంది రోగులు హాజరు కాగా వీరిలో 43 మందిని వివిధ శస్త్రచికిత్సలకు ఎంపికయ్యారని వాసవీ క్లబ్ అధ్యక్షులు గ్రంథి రవికుమార్ తెలిపారు. వైద్యులు సాయితేజ, గిరీష్‌రెడ్డి, వాసవీక్లబ్ సభ్యులు వాకచర్ల రాజ, అంబరీస్, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

సీఓపీ సర్వే వేగవంతం చేయండి

సంతకవిటి: మండలంలోని కాకరాపల్లి పంచాయతీ అక్కరాపల్లి గ్రామంలో ఎంపీడీఓ యస్.రఘునాధాచారి సీఓపీ(సిటిజన్ ఔట్ రీచ్ పల్స్) సర్వేను శుక్రవారం పరిశీలించారు. సర్వేను వేగవంతం చేయాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. రోజుకు 50 శాతం చొప్పున రెండు రోజుల్లో సర్వేను పూర్తి చేయాలని అన్నారు. సర్వే సమయంలో అందుబాటులో ఉన్న అందరి చేత తప్పనిసరిగా ఈకేవైసీ చేయించాలని ఆదేశించారు. ఏపీఓ త్రినాథరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను చెల్లింపుపై ఐదు శాతం రాయితీ

బొబ్బిలి: ఆస్తి పన్ను, ఖాళీ జాగాలపై పన్ను చెల్లింపులకు ఈనెల 30 వరకు 5 శాతం రాయితీ వర్తిస్తుందని మున్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకమొత్తంలో చెల్లించే వారి కోసం ఆదివారం కూడా కార్యాలయంలో కౌంటర్ తెరిచే ఉంటుందని, పన్ను చెల్లింపుదారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.